## ఆర్టీసీ సేవలపై కళాజాత..



కొడంగల్, జూన్ 27: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణమని డీఎం. సమత తెలిపారు. గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ సేవలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజాప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థగా పేర్కొన్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు ప్రమాదకరమని, ఆర్టీసీలోనే ప్రయాణం చేద్దాం. ఆర్టీసీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నిర్మల, కంట్రోలర్ చారితో పాటు సిబ్బంది వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయంపై కాంగ్రెస్ ఫ్లెక్సీ..



దోమ,జూన్ 27: దోమ మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రజలదని, ఏ పార్టీకి సంబంధించింది కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారిపై సంబంధిత ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## పదోన్నతి పొందిన టీచర్లకు రిలీవ్ ఆర్డర్లు..



కులకచర్ల/పరిగి, జూన్ 27:ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల్లో భాగంగా ఉద్యోగన్నతులు పొందిన, బదిలీలు అవుతున్న టీచర్లకు రిలీవ్ ఆర్డర్లు ఇస్తున్నామని పరిగి ఎంఈవో హరిశ్చందర్ తెలిపారు. గురువారం పరిగి మండలంలో ఉద్యోగన్నతి పొందిన ఉపాధ్యాయులకు రిలీవ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఇసుక డంపులు



*గట్టున్నపల్లి దగ్గర డంపు చేసిన ఇసుక*

కులకచర్ల, జూన్ 27 : ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొందరు గుట్టు చప్పుడు కాకుండా రాత్రివేళల్లో ఇసుకను రవాణా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. కులకచర్ల మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామ సమీపంలో, గట్టున్నపల్లి దగ్గర, వీటితో పాటు కొన్ని స్థలాల్లో అక్రమంగా ఇసుక డంపులు ఏర్పాటు చేసి వాగుల్లో నుంచి తీయడంతో పాటు ఇసుకను ఫిల్టర్ చేసి రవాణా చేస్తున్నట్లు గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ విషయంపై కులకచర్ల తహసీల్దార్ మురళీధర్‌ను వివరణ కోరగా అక్రమ ఇసుకను రవాణా చేసినా, ఇసుక డంపులు ఏర్పాటు చేసిన వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే సీజ్ చేసి వాల్టా చట్టం కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## చినుకు పడితే చిత్తడే..



మర్పల్లి, జూన్ 27: మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రంలోని ప్రధానరోడ్డు చిన్న వర్షం పడితేనే చిత్తడిగా మారి ప్రయాణికులు నడువలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు.. బస్టాండ్ వద్ద రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. దాంతో వాహనదారులు, పాదచారులు ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు.. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు..

### నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దేముల్, జూన్ 27: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మం డల ఎంపీపీ అనురాధ అధ్యక్షతన శుక్ర వారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్న ట్లు మండల ఎంపీడీవో జర్నప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావే శానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. మండల ప్రాదేశిక నియోజక వర్గపు సభ్యులు, గ్రామ పంచాయతీల ప్రత్యేకఅధికారులు,డివిజన్, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో జర్నప్ప కోరారు.అదే విధంగా మండల ఎంపీపీ, జడ్పీటీసీ,ఆయా గ్రామాల ఎంపీటీసీల పదవీకాలం ముగియ నుం డడంతో వారికి కార్యాలయం తరపున ప్రత్యేకంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

### దుకాణ సముదాయాలకు వేలం పాట

తాండూరు రూరల్, జూన్ 27:తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామ పంచాయతీ ఆధీనంలోని తొమ్మిది దుకాణాలను గురు వారం వేలం వేశారు. ఎంపీఈవో రతన్ సింగ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ రావు, ఎంపీటీసీ రాజ్‌కుమార్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. మార్చి నెల లోనే యాక్షన్ నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ కారణంగా నిర్వహించలేదని అధికారులు తెలిపారు. తొమ్మిది దుకాణాలకుగాను ఒక్కో దుకాణానికి రూ.10,000ల డిపాజిట్ రూపంలో తీసుకున్నారు. గత ఏడాది కంటే 10 శాతం అద్దె పెంచుతూ దుకాణాలను వేలం వేశారు. ఒక్కో దుకా ణానికి ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందని అధికారులు తెలిపారు. నంబర్ 1 దుకా ణాన్ని నర్సింహులు గౌడ్, 2 ను గుణ శేఖ ర్, 3 పీర్‌పాషా, నెంబర్ 4 ను సాబేర్ మియా, 5 ను దశరథ్, 6ను దోమ శ్రీని వాస్, 7ను మల్లేశ్, 8ని వసంత్, దుకాణం 9 ని సాయిలు దక్కించుకున్నారు.

# బాలికల ఆరోగ్యానికి ప్రత్యేక చర్యలు

- రక్తహీనత నివారణకు ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ
- ప్రతి గురువారం పాఠశాలలు, కళాశాలల్లో అందజేత
- వికారాబాద్‌లో విద్యార్థినులకు మాత్రలు వేసిన మున్సిపల్ చైర్‌పర్సన్
- కులకచర్ల మండలంలో 1836 మంది బాలికలకు ట్యాబ్లెట్లు పంపిణీ
- అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు



*వికారాబాద్: విద్యార్థికి ఫోలిక్ యాసిడ్ మాత్ర వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల*

వికారాబాద్, జూన్ 27 : బాలికలకు ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసి రక్తహీనతను సమూలంగా తగ్గించే దిశగా ముందుకు వెళ్లాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని రిక్షా కాలనీలోని కేజీబీవీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేసిన సర్వేలో జిల్లాలో 75 శాతం మంది పిల్లల్లో రక్తహీనత సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కాబట్టి పిల్లలకు ప్రతి గురువారం ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్‌ను తప్పకుండా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ జీవరాజ్, డీఐవో బుచ్చిబాబు, మెడికల్ అధికారులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సృజన, జీసీడీవో శ్రీదేవి, స్కూల్ ప్రిన్సిపాల్ స్వరూప, విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
**కులకచర్ల:** పదకొండు నుంచి 17 సంవత్సరాల వయసున్న బాలికలకు ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు వేయించాలని కులకచర్ల మండల వైద్యాధికారి డాక్టర్ వాజుద్దీన్, డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, బండవెల్కిచర్ల బాలికల ఆశ్రమ పాఠశాల, కులకచర్ల బాలికల ఉన్నత పాఠశాల, చౌడాపూర్ ఉన్నత పాఠశాల, రాంపూర్ ఆశ్రమ పాఠశాలల బాలికలకు ఫోలిక్‌యాసిడ్ ట్యాబ్లెట్లు వేయించారు. మండలంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న 2265 మంది బాలికలకు గాను 1836 మంది బాలికలకు ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. మిగిలిన 429మంది బాలికలకు కూడా ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తామన్నారు. బాలికల్లో రక్తహీనతను తగ్గించడానికి ఇకపై ప్రతి గురువారం ఫోలిక్‌యాసిడ్ ట్యాబ్లెట్‌లను వేయించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి 60 ఎంజీ ట్యాబ్లెట్‌ను ఇస్తున్నట్లు తెలిపారు. బాలికల్లో 75శాతం రక్తహీనతతో బాధపడు తున్నారని వారికి పీరియడ్స్ సమయంలో అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీంతో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, డాక్టర్లు, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఫోలిక్‌యాసిడ్ ట్యాబ్లెట్‌ల ఉపయోగం గురించి తెలియజేస్తున్నామన్నారు. ఈ ట్యాబ్లెట్లు వేయడం ద్వారా రక్తహీనత నివారణతో పాటు రక్తంలోని కణాలు పరిపక్వం చెందుతాయన్నారు. గర్భాధారణ సమయంలో ఫోలిక్ ఆమ్లం లేకపోవడం వలన పుట్టే పిల్లల్లో లోపాలు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కూరలు, పండ్లు, బీన్స్, పుట్టగొడుగులు, గుడ్డు పచ్చని సొన, బంగాళదుంపలు, పాలు, తృణ ధాన్యాలు తినడం ద్వారా రక్తహీనత రాకుండా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్‌వో దేవి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



*కులకచర్ల కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ వాజుద్దీన్, డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్*

## ఉపాధ్యాయ వృత్తికి తగిన గుర్తింపు



*హెచ్‌ఎం రాములును సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు, వివిధ పార్టీల నాయకులు*

కులకచర్ల, జూన్ 27 : ఉత్తమమైన వృత్తికి మంచి గుర్తింపు లభిస్తుందని కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ చౌడాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు ఉద్యోగ విరమణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు దంపతులను పీఆర్టీయూ ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎంఈవో హరిచందర్, కులకచర్ల, చౌడాపూర్ మండలాల ఎంఈవో హబీబ్‌అహ్మద్, మాజీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తిమ్యానాయక్, మరికల్ మాజీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శులు అయూబ్‌ఖాన్, రాజు, పీఆర్టీయూ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నాయకులు నాగరాజు, ఎల్పటి అశోక్‌కుమార్, పాండురంగయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫైలేరియా, లెప్రసీ రోగులకు అవగాహన



*రోగులకు ఫైలేరియా కిట్ అందజేస్తున్న డాక్టర్ శిరీష, రవీంద్ర యాదవ్*

బొంరాస్‌పేట, జూన్ 27 : బోదకాలు, కుష్టు వ్యాధిగ్రస్తులు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్ అన్నారు. గురువారం బొంరాస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా, లెప్రసీ రోగులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. కాళ్లను ఎలా శుభ్రం చేసుకోవాలని, పుండ్లు పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై వారు అవగాహన కల్పించారు. బోదకాలు సోకిన రోగులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఆశా కార్యకర్తలు కూడా ఫైలేరియా, లెప్రసీ వ్యాధిగ్రస్తుల ఇండ్లను సందర్శించి వైద్యారోగ్య శాఖ అధికారుల సూచనలు పాటిస్తున్నారా లేదా గమనిస్తు ఉండాలన్నారు. అనంతరం బకెట్, జగ్, సబ్బు, టవల్‌తో కూడిన ఫైలేరియా కిట్‌ను రోగులకు డాక్టర్ శిరీష, డాక్టర్ రవీంద్ర యాదవ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్ కుమార్, సీహెచ్‌వో శివరాజ్, ఫైలేరియా కొడంగల్ సబ్ యూనిట్ ఆఫీసర్ ఫకీరప్ప, సూపర్ వైజర్ మణిమాల, ఆయుష్ ఫార్మాసిస్టు సుదర్శన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువులకు ముందస్తు టీకాలు



*టీకా వేస్తున్న ఏడీ.డా.నోవా, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి.*

కొడంగల్, జూన్ 27: పశువుల్లో ఏర్పడే లంపీ స్కిన్ వ్యాధికి ముందస్తుగా పశుసంవర్ధక శాఖ ద్వారా వ్యాధినిరోధక టీకాలు అందిస్తున్నట్లు వెటర్నరీ ఏడీ డా.నోవా పేర్కొన్నారు. గురువారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువులకు టీకా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో సీజన్ వ్యాధిగా ఏర్పడే లంపీస్కిన్ వ్యాధి నుంచి పశువులను కాపాడుకునేందుకు గాను తప్పకుండా రైతులు లంపీ స్కిన్ వ్యాధి టీకాలను ఇప్పించాలని సూచించారు. పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకడం వల్ల మేత మేయడంలో ఇబ్బంది ఏర్పడి నీరసించే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి సోకితే రైతులు గాబరా పడకుండా అందుబాటులో ఉండే ఇంటి వైద్యం చేసుకోవచ్చని తెలిపారు. 50 గ్రాముల జిలుకర్ర, 50గ్రాముల వాము, 50గ్రాముల సోంపును పొడి చేసి తినిపిస్తే చాలా వరకు వ్యాధి నివారణ అవుతుందని తెలిపారు. అదేవిధంగా మజ్జిగను తాగించినా వ్యాధిని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు చర్యలు



కులకచర్ల, జూన్ 27 : పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు కృషిచేస్తున్నామని తెలిపారు. వార్డుల వారిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి రోజు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు

### నేడు ఉచిత వైద్య శిబిరం

ధారూరు, జూన్ 27: ధారూరు మండల పరిధిలోని కేరెళ్లి గ్రామంలోని సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం ఆధ్వర్యంలో ఎంఎన్‌జే హాస్పిటల్ హైదరాబాద్ వారిచే ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

### రేపు పరిగి మండల సర్వసభ్య సమావేశం

కులకచర్ల/పరిగి, జూన్ 27 : ఈ నెల 29న పరిగి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పరిగి ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పరిగి మండల పరిషత్ కార్యా లయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశం ఎంపీపీ కరణం అరవిందరావు అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీ టీసీ లు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని అన్నారు.

### చాయ్ పెట్టనందుకు.. కోడల్ని చంపిన అత్త

బండ్లగూడ, జూన్ 27: చాయ్ పెట్టనన్నందుకు ఓ మహిళ తన కోడల్ని చున్నీతో ఉరేసి హత్య చేసింది. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కథనం ప్రకారం.. హసన్‌నగర్‌కు చెందిన ఫర్జానా బేగం గురువారం ఉదయం 9 గంటల సమయంలో తన కొడలు అజ్మీర్ బేగం(28)ను చాయ్ పెట్టమని చెప్పింది. దీంతో కోడలు ఆజ్మీర బేగం.. చాయ్ పెట్టనని చెప్పింది. అత్త ఫర్జానా బేగం కోపంతో అజ్మీర్ బేగంను చున్నీతో ఉరేసి హత్య చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### కొడుకుతో ఆడుకుంటున్న..తండ్రిని చితకబాదారు

మెహిదీపట్నం జూన్ 27: భార్య పరీక్షల కోసం చిన్నారి కొడుకుతో వచ్చిన ఓ వ్యక్తిని బౌన్సర్లు చితకబాదారు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన రాజేశ్ కుమార్ గురువారం తన భార్య శ్రీలేఖ, కుమారుడు లక్ష్మణ్ మైత్రేయతో కలిసి షేక్‌పేట నారాయణమ్మ కళాశాలకు వచ్చాడు. శ్రీలేఖకు హాస్టల్ వార్డెన్ పరీక్ష ఉండటంతో అక్కడికి వచ్చారు. శ్రీలేఖ పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళ్లగా.. రాజేశ్ కుమార్ తన కుమారుడితో పరీక్షా కేంద్రం సమీపంలో ఆడుకుంటున్నాడు. ఇక్కడ ఆడుకోవద్దని, బయటకు వెళ్లాలని సెక్యూరిటీ గార్డులు చెప్పారు. ఈ విషయంపై వాగ్వాదం జరుగగా.. అక్కడున్న కళాశాలకు చెందిన బౌన్సర్లు రాజేశ్ కుమార్‌పై దాడి చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో రంగంలోకి దిగి విచారణ చేపట్టిన పోలీసులు.. రాజేశ్ కుమార్ వద్ద నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

### రేపు కులకచర్ల తైబజార్‌కు వేలం పాట

కులకచర్ల, జూన్ 27 : ఈ నెల 29న కులకచర్ల కూరగాయల తైబజార్‌కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కులకచర్ల గ్రామ ప్రత్యేక అధికారి మురళీధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కులకచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు వేలంపాట ఉంటుందని, వేలం పాటలో పాల్గొనాల నుకునే వారు ముందుగానే పంచాయతీ కార్యాలయా న్ని సంప్రదించాలని తెలిపారు.

### మర్పల్లి తైబజార్ వేలం..

మర్పల్లి, జూన్ 27: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద తైబజార్ వేలంపాటను శనివారం ఉదయం 10 గం టలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో నిర్వహిం చాల్సిన తైబజార్ వేలం ఎంపీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిందని 9 నెలలకు వేలం పాటలో పాల్గొనే వారు రూ.2 వేలు పంచాయతీ కార్యాలయంలో కట్టి పాల్గొనాలని సూచించారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కులకచర్ల, పరిగి, జూన్ 27 : పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధించుటకు తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకులు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ జె రాజారాం తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి కళాశాలలో బోధించుటకు అధ్యాపకులు అవసరమున్నారన్నారు. కళాశాలలో వివిధ అధ్యాపకుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. తెలుగు–1, ఆంగ్లం–1, హిస్టరీ–1, పొలిటికల్ సైన్స్–1, ఎకనామిక్స్–1, కామర్స్–1, కంప్యూటర్ అప్లికేషన్ సైన్స్–1, జువాలజీ–1, గణితం–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో 50శాతం మార్కులు ఉండాలని, ఇతర అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. నీట్/సెట్/స్లెట్/పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29లోపు కళాశాల యందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 970 1774143 కి ఫోన్ చేయాలని తెలిపారు.

**తాండూరు డిగ్రీ కళాశాలలో..**

**యాలాల:** తాండూరు డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపాదికన విద్యాబోధన చేసేందుకు అర్హులైన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.వివేక్ కుమార్ దూబే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, వాణిజ్యం, రాజనీతి శాస్త్రం, గణితం, కంప్యూటర్ సైన్స్–అప్లికేషన్స్, జంతు శాస్త్రంలో ఒక్కో ఖాళీ ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి పూర్తి వివరాలను జూలై 1వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో ఇవ్వాలన్నారు. బోధనా అనుభవం కలిగిన వారు తప్పని సరిగా సర్వీస్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

### లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన స్పీకర్

వికారాబాద్, జూన్ 27: మోమిన్‌పేట మండలానికి చెందిన లబ్ధిదారులకు మండల కేంద్రం రైతు వేదికలో అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో ఆయా గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, నాయకులు నరోత్తం రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, ఇరాజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కులకచర్ల/ పరిగి, జూన్ 27 : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలం సంగాయపల్లి గ్రామానికి చెందిన కుర్వ మల్లయ్య(55) ఆయన కుటుంబసభ్యులు గడిసింగాపూర్ గ్రామం వద్ద ఉన్న పురుషోత్తంరావు మామిడి తోటలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. గురువారం మల్లయ్య మామిడి తోట నుంచి గడిసింగాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి తోటకు వెళుతుండగా గ్రామం దాటి కొద్ది దూరం రాగానే ఇబ్రహీంపూర్ నుంచి కొడంగల్‌కు వస్తున్న బైక్ మల్లయ్యను ఢీకొనడంతో ముందుగా వెళుతున్న ఆటో వెనుకభాగంలో తగులగా తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమార్తె కుర్వ మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ ప్రముఖ స్వచ్ఛంద సంస్థలో పని చేయడానికి ITI ఫిట్టర్ / ఎలక్ట్రీషియన్ / డిగ్రీ సిబ్బంది కావలెను. వికారాబాద్ / శంకరపల్లి ప్రాంత నివాసులకు ప్రాధాన్యత. రెజ్యూమ్‌తో హాజరవ్వండి. ఇంటర్వ్యూ తేది: 30–06–2024 ఆదివారం ఉ॥ 10 గం. నుండి. స్థలం: శ్రీ నవజ్యోతి విద్యాలయం, రామయ్యగూడ రోడ్, వికారాబాద్.

NT-339525

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

Telangana Today

FOR LOCAL TO GLOBAL NEWS

పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.

ప్రకటనల విభాగం సెల్: 80966 77655

వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962